క్లుప్తంగా

మంచిని అడ్డుకుంటున్న టీడీపీ

బొమ్మలసత్రం: పేద ప్రజలకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మంచి చేస్తుంటే టీడీపీ నేతలు పలు విధాలుగా అడ్డుకుంటున్నారని ఏపీఎస్పీడీసీఎల్ డైరెక్టర్ డాక్టర్ శశికళారెడ్డి మండిపడ్డారు. శనివారం ఆమె మాట్లాడుతూ సంక్షేమ పథకాలను ఇంటి వద్దకు చేరుస్తున్న వలంటీర్లను బాబు, ఆయన అనుచరులు ఎన్నికల కమిషన్‌కు అబద్ధాలు అందజేసి ఫిర్యాదు చేసి అడ్డుకున్నారన్నారు. అలాగే ప్రతి నెల 1వ తేదీ వృద్ధులకు అందే పింఛన్‌ను ఇప్పుడు నానా కష్టాలు పడి తీసుకునేలా తయారు చేయడానికి చంద్రబాబు చర్యలే కారణమన్నారు. చేయూత, ఆసరా, ఇన్‌పుట్ సబ్సిడీ, జగనన్న విద్యాదీవెన లాంటి సంక్షేమ పథకాల సొమ్ము ఇంతవరకు ప్రజలకు అందకపోవడానికి కూడా ఆయన చేసిన ఫిర్యాదులే కారణమన్నారు. అన్ని వర్గాల ప్రజల కోసం జగనన్న సంక్షేమ పథకాల ద్వారా ఆదుకుంటుంటే టీడీపీ వివిధ మార్గాల ద్వారా అడ్డంకులు సృష్టిస్తోందని చెప్పారు. ఈ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించి చంద్రబాబుకు ఓటుతో తగిన గుణపాఠం చెప్పాలని ప్రజలు కోరారు.

మహానందిలో ఎంపీ పోచా పూజలు

మహానంది : మహానందీశ్వరుడి సన్నిధిలో నంద్యాల ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి శనివారం పూజలు నిర్వహించారు. శ్రీ కామేశ్వరీదేవి సహిత శ్రీ మహానందీశ్వరస్వామి వారిని దర్శించుకుని అభిషేకం, కుంకుమార్చన పూజలు చేపట్టారు. దర్శనం అనంతరం ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి స్వామి, అమ్మవారి ప్రసాదాలు అందించి వేదాశీర్వచనం చేయించారు. తమ్మడపల్లె వద్ద జడ్పీటీసీ కేవీఆర్ మహేశ్వరరెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు కొమ్మ మహేశ్వరరెడ్డి, గ్రామస్తులు మర్యాదపూర్వకంగా కలిశారు.

పోలింగ్ కేంద్రాల వద్ద వీల్‌చైర్లు

మహానంది: బండిఆత్మకూరు మండలంలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాల వద్ద వీల్‌చైర్లు అందుబాటులో ఉంచుతున్నట్లు ఎంపీడీఓ విజయరావు తెలిపారు. శనివారం బండిఆత్మకూరులోని ఎంపీడీఓ కార్యాలయానికి 25 వీల్‌చైర్లు వచ్చినట్లు చెప్పారు. ప్రతి పోలింగ్ స్టేషన్ వద్ద ఒకటి ఉంటుందని, దివ్యాంగుల సౌకర్యార్థం వినియోగిస్తామన్నారు.

ఆర్ కృష్ణయ్యపై దాడి హేయమైన చర్య

కర్నూలు(అర్బన్): జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యులు ఆర్ కృష్ణయ్యపై రాళ్లతో దాడి చేయడం హేయమైన చర్య అని సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి నక్కలమిట్ట శ్రీనివాసులు అన్నారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ దశాబ్దాలుగా బీసీ ఉద్యమాలను నిర్మిస్తూ బీసీల ఆత్మగౌరవం కోసం అనేక దేశ వ్యాప్త ఉద్యమాలు చేపట్టి సఫలీకృతులైన కృష్ణయ్యపై దాడిని ప్రజాస్వామ్యవాదులంతా ఖండిస్తున్నారన్నారు. ఆయన చేసిన అనేక సామాజిక ఉద్యమాల వల్ల పలు సమస్యలకు పరిష్కారం లభించిందన్నారు. రాజకీయాల్లో ఒకరిపై ఒకరు విమర్శించుకోవడం సహజమేనని, అయితే భౌతికదాడులకు పాల్పడడం సరి కాదన్నారు. కృష్ణయ్యపై దాడి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

రైలు నుంచి జారిపడి యువకుడి మృతి

డోన్ రూరల్ : మండల పరిధిలోని మల్యాల గ్రామం వద్ద శుక్రవారం రాత్రి సమయంలో గుర్తు తెలియని రైలు నుంచి జారిపడి గౌరబ్ మిత్రా(22) అనే యువకుడు మృతి చెందినట్లు రైల్వే పోలీసులు తెలిపారు. శనివారం ఉదయం స్థానికుల సమాచారం మేరకు అక్కడికి చేరుకొని మృత దేహాన్ని పరిశీలించామన్నారు. ఆధార్, సెల్ ఫోన్ ఆధారంగా వెస్ట్ బెంగాల్‌కు చెందిన వ్యక్తిగా గుర్తించామన్నారు. మృతదేహాన్ని డోన్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి వారి కుటుంబ సభ్యులకు సమాచారం అందించామన్నారు. కేసు నమోదు చేసుకొని పోస్టు మార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించామని రైల్వే పోలీసులు తెలిపారు.

వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను గెలిపించండి



ఆర్.పాంపల్లెలో నమూనా ఈవీఎంతో అవగాహన కల్పిస్తున్న ఎంపీపీ బుడ్డా భాగ్యమ్మ, పోచా శృతి

ఉయ్యాలవాడ : ఈ నెల 13వ తేదీన జరిగే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు ఎమ్మెల్యేగా గంగుల బిజేంద్రారెడ్డి, ఎంపీగా పోచా బ్రహ్మానందరెడ్డిని గెలిపించాలని ఎంపీపీ బుడ్డా భాగ్యమ్మ, పోచా శృతి కోరారు. శనివారం మండలంలోని ఆర్.పాంపల్లె గ్రామంలో నమూనా ఈవీఎంతో ప్రజలకు అవగాహన కల్పిస్తూ ఓట్లు అభ్యర్థించారు. కాగా మండలంలో ఈనెల 14వ తేదీన ఎన్నికల ప్రచారం ప్రారంభించారు. చివరి రోజు నాయకులు విస్తృతంగా పర్యటించి ఓటు వేయాలని ఓటర్లను కోరారు. ఎంపీటీసీ సభ్యురాలు కపురం శివమ్మ, సర్పంచ్ చాబోలు లక్ష్మిదేవి, పార్వతి దేవి, పోచా గీతా, రమణమ్మ, మహేశ్వరమ్మ, నాయకులు కపురం శ్రీనివాసరెడ్డి, కందుల వెంకటసుబ్బారెడ్డి, మధుబాబు పాల్గొన్నారు.

సంక్షేమ వికాసం.. అభివృద్ధి దరహాసం

- వైఎస్సార్‌సీపీ పాలనలో రూపురేఖలు మారిన ఆళ్లగడ్డ పట్టణం
- ఐదేళ్లలో 50 ఏళ్ల ప్రగతి
- గడప గడపకూ సంక్షేమ పథకాలు
- పట్టణ ప్రజల ఖాతాల్లోకి రూ 183.026 కోట్లు జమ
- నాన్ డీబీటీ ద్వారా మరో రూ 90.25 కోట్ల లబ్ధి



ఆళ్లగడ్డ పట్టణం నాలుగు రోడ్ల కూడలి

ఆళ్లగడ్డ: ఫ్యాక్షన్.. ఆళ్లగడ్డకు అభివృద్ధిని దూరం చేసింది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడిన తరువాతే ఆళ్లగడ్డ పట్టణం అభివృద్ధి పథంలో పరుగులు తీసింది.. కళ్లు చెదిరేలా నిర్మించిన టిడ్కో ఇళ్లు నిరుపేదల సొంతింటి కలను సాకారం చేశాయి. ఇరుకు రోడ్లు విశాలంగా మారాయి. కోట్లాది రూపాయలతో పట్టణంలోని ప్రతి వీధిలో సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణంతో వివిధ అభివృద్ధి పనులు చేపట్టింది. ఇక అన్ని వర్గాలకు సంక్షేమ ఫలాలు అందాయి. జగనన్న కాలనీ ఏర్పాటు చేసి అర్హులందరికీ ఇళ్ల స్థలాలు కేటాయించి, ఇళ్ల నిర్మాణాలకు నిధులు విడుదల చేసింది.

మున్సిపాలిటీగా మార్పు..

నగర పంచాయతీగా ఉన్న ఆళ్లగడ్డ పట్టణాన్ని మున్సిపాలిటీగా అప్‌గ్రేడ్ చేసి అభివృద్ధి దిశలో నడిపించారు. పట్టణంలో నెలకొన్న తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపించారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో నగర పంచాయతీని అప్‌గ్రేడ్ చేయడం వృథా అని నాడు కాలం వెళ్లబుచ్చారు. పట్టణ జనాభా 43 వేలు కాగా ఇందులో పేద మధ్యతరగతి కుటుంబాలు ఎక్కువ. ఇప్పటి వరకు పట్టణంలోని అర్హులకు సంక్షేమ పథకాల ద్వారా రూ. 183.026 కోట్ల నగదును డీబీటీ ద్వారా లబ్ధిదారుల ఖాతాల్లో నేరుగా ప్రభుత్వం జమ చేసింది. అలాగే పరోక్ష ప్రయోజనాల కింద (నాన్ డీబీటీ) మరో రూ 90.25 కోట్ల మేర లబ్ధి చేకూర్చింది. దీంతో ప్రజలు ఆర్థిక ఇబ్బందులు లేకుండా సంతోషంగా జీవనం సాగిస్తున్నారు.

ఒక్కో కుటుంబానికి రూ.2.57 లక్షల లబ్ధి

పట్టణ పరిధిలో 14,139 నివాస గృహాలు ఉండగా వీరిలో ఉద్యోగులు, సంపన్నులు, పథకాలు వర్తించని కుటుంబాలు సుమారు 3,500 వరకు ఉన్నాయి. మిగిలిన 10,639 ఇళ్లకు సంక్షేమ పథకాలు అందాయి. మెజార్టీ కుటుంబాలు 1–3 పథకాలు అందుకుంటున్నాయి. ఆయా కుటుంబాలకు సుమారు రూ.274 కోట్ల లబ్ధి చేకూరగా సగటున ఒక్కో కుటుంబానికి రూ.2,57,543 మేర లబ్ధి చేకూరింది.

ఐదేళ్లలో పట్టణంలో చేపట్టిన పనులు, చేసిన ఖర్చు

నిధులు	పనులు	ఖర్చు చేసింది
గడప గడపకు	రూ.లక్షల్లో	
మన ప్రభుత్వం	63	500
ఎంపీ నిధులు	3	50
సీఎండీఎఫ్	5	50
ఎస్‌సీఎస్‌పి	1	15
14 ఫైనాన్స్	61	626.97
15 ఫైనాన్స్	44	723.41
యూపీహెచ్‌సీ	1	80
	178	2045.38



50 పడకల సామాజిక ఆరోగ్య కేంద్రం

అభివృద్ధి పనుల వివరాలు..

- రూ.కోటితో ఇండోర్ స్టేడియం ఏర్పాటు
- పట్టణ సమీపంలో 1,394 టిడ్కో ఇళ్లను నిర్మించి వసతులు కల్పించారు. ఇందుకు రూ. 1,390 కోట్ల మేర ఖర్చు చేసింది.
- జగనన్న టౌన్ కాలనీల్లో రోడ్లు, డ్రైనేజీ, విద్యుత్ సౌకర్యాలకు అదనంగా ఖర్చు చేశారు.
- 30 పడకల ఆసుపత్రిని 50 పడకల ఆసుపత్రిగా రూ.12 కోట్లతో ఆధునీకరించారు. నూతన భవనాలు నిర్మించారు. అత్యాధునిక వైద్య పరికరాలను అందుబాటులోకి తీసుకు వచ్చారు. ఏడు మంది స్పెషలిస్ట్ డాక్టర్లను నియమించారు.
- పట్టణంలో రూ.80 లక్షలతో అర్బన్ హెల్త్ సెంటర్‌ను ఏర్పాటు చేశా
- పట్టణంలో నాడు-నేడు పనుల్లో రూ.20 కోట్లతో ప్రభుత్వ విద్యాలయాలను అభివృద్ధి చేశారు.
- ఐదు దశాబ్దాలుగా ఊరిస్తున్న డిగ్రీ కళాశాలను ఏర్పాటు చేసి స్థానికులకు ఉన్నత విద్యను అందుబాటులోకి తెచ్చారు. అలాగే..అందులో అవసరమైన రెగ్యులర్ పోస్టులు, భవన నిర్మాణానికి రూ.2 కోట్లు విడుదల చేసింది.
- జిల్లాలోనే మొదటిసారిగా ఆళ్లగడ్డ పట్టణంలో రూ.1.50 కోట్లతో వైఎస్సార్ అగ్రి టెస్టింగ్ ల్యాబ్, పశువ్యాధి నిర్ధారణ ప్రయోగశాల ఏర్పాటు చేసింది

మురుగు సమస్య తీరింది



గతంలో ఎన్నడూ లేనంతగా పట్టణం అభివృద్ధి చెందింది. మా పక్క వీధిలో మురుగు కాల్వలు లేక మురుగు సక్రమంగా పారేది కాదు. గడప గడపకు వచ్చినప్పుడు ఎమ్మెల్యేకు సమస్యను వివరించాగా వెంటనే మురుగు కాల్వలు నిర్మించి సమస్యను పరిష్కరించారు. గతంలో ఇంత త్వరగా సమస్యలు పరిష్కారం కాలేదు. – రమీజాబీ, ఆళ్లగడ్డ

చాలా సంతోషంగా ఉంది



మేము శివారు కాలనీలో ఉంటాం. మా కాలనీతో పాటు చుట్టు పక్కల కాలనీలు ఏర్పడ్డప్పటి నుంచి రోడ్లు, మురుగు కాల్వలు లేక ఎన్నో ఇబ్బందులు పడ్డాం. ఇప్పుడు అన్ని కాలనీల్లో రోడ్లు, మురుగు కాల్వలు కొత్తగా వేశారు. రోజు కుళాయిలకు నీరు వస్తుంది. మాకు దగ్గరలోనే సచివాలయం ఉంది. మా పనులన్నీ అక్కడే చేయించుకుంటున్నాం. ఇవన్నీ చూస్తుంటే చాలా సంతోషంగా ఉంది.
– ఉగ్రదేవి, ఆళ్లగడ్డ

మేలు చేసిన ప్రభుత్వాన్ని ఓటుతో ఆదరించండి

- మద్దూరు రోడ్‌షోలో గంగుల బిజేంద్రారెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి




రోడ్ షోలో ప్రజలకు అభివాదం చేస్తున్న ఎమ్మెల్యే గంగుల బ్రిజేంద్రారెడ్డి

ఆళ్లగడ్డ: గడప గడపకు సంక్షేమాన్ని అందించి, అందరికీ మేలు చేసిన, ప్రజల జీవితాల్లో వెలుగులు నింపిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వాన్ని మరోసారి ఓటుతో ఆదరించాలని ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి కోరారు. శనివారం రూరల్ మండలం ఓబులంపల్లె, కోటకందుకూరు గ్రామాల్లో నిర్వహించిన రోడ్‌షోకు అనూహ్య స్పందన లభించింది. ఆయన మాట్లాడుతూ రాజకీయాలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా పారదర్శకంగా సంక్షేమ పథకాలు అందించిన ముఖ్యమంత్రి దేశంలో వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఒక్కరేనన్నారు. చంద్రబాబు అధికారంలోకి వస్తే ముస్లింల నాలుగు శాతం రిజర్వేషన్లు రద్దవుతాయన్నారు. బడుగు బలహీన వర్గాలకు సముచిత స్థానం కల్పించింది జగనన్నే అన్నారు. పేదల పక్షాన పోరాడుతున్న జగనన్నను మరోసారి ముఖ్యమంత్రి చేయాలంటే ఫ్యాన్ గుర్తుపై రెండు ఓట్లు వేసి ఎమ్మెల్యేగా తనను, ఎంపీ పోచా బ్రహ్మానంద రెడ్డిని గెలిపించాలని అభ్యర్థించారు. ఎంపీపీ గజ్జల రాఘవేంద్రారెడ్డి, నాయకులు రవిరెడ్డి, శ్రీరామరెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, శివారెడ్డి, రామకృష్ణ, కొలిమిబాషా, గోపాల్‌రెడ్డి ఉన్నారు.

నీతి, నిజాయితీ మా కుటుంబం పెట్టుబడి

చాగలమర్రి: మూడు తరాలుగా ఆళ్లగడ్డ రాజకీయాల్లో రాణిస్తున్నామంటే తమ కుటుంబానికి నీతి, నిజాయితీలే పెట్టుబడి అని, పార్టీ నాయకులు, కార్యకర్తల ఆశీర్వాదలతోనే సాధ్యమైందని ఆళ్లగడ్డ నియోజకవర్గ అసెంబ్లీ అభ్యర్థి గంగుల బిజేంద్రారెడ్డి అన్నారు. శనివారం సాయంత్రం మండలంలోని మద్దూరు గ్రామంలో సింగిల్‌విండో అధ్యక్షుడు దస్తగిరి, మహబూబ్ షరీఫ్‌తో కలిసి రోడ్ షో నిర్వహించారు. కాగా ఎన్నికల ప్రచారం ఈ గ్రామం నుంచే ప్రారంభించి, ఇదే గ్రామంలో ముగించడం విశేషం. ప్రచారం ముగింపు సందర్భంగా ముందుగా గ్రామంలో వెలసిన వేంకటేశ్వర స్వామిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా కార్యకర్తలు భారీగా బైక్ ర్యాలీతో ఆయనకు స్వాగతం పలికారు. అనంతరం గ్రామ ప్రధాన కూడలిలో ఏర్పాటు చేసిన బహిరంగ సమావేశంలో ప్రజలనుద్దేశించి మాట్లాడారు. గత ఐదేళ్లలో గ్రామంలో రూ.17కోట్లు సంక్షేమ పథకాల కింద అందజేశామని చెప్పారు. అదే టీడీపీ నాయకులు ప్రజలకు ఏమి చేశారని ప్రశ్నించారు. వారి పాలనంతా దోపిడీలు, దౌర్జన్యాలేనని, తాము ఐదేళ్లుగా ప్రశాంతంగా పాలించామని, ఆ వాతావరణాన్ని చెడగొట్టుకోకుండా కొనసాగించుకోవాలంటే ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా పోచా బ్రహ్మానంద రెడ్డిని గెలిపించాలని అభ్యర్థించారు. ఎంపీపీ వీరభద్రుడు, జి.గణేష్‌రెడ్డి, శివ ప్రసాద్, జమాల్‌వలి, కె.షరీఫ్, నారాయణ, కె.మాబాషా, శ్రీనివాసులురెడ్డి, రమణారెడ్డి, చిన్ననాయుడు, ముత్యాలపాడు దస్తగిరి, బాబు పాల్గొన్నారు.

- ముగిసిన సార్వత్రిక ఎన్నికల ప్రచారం
- చివరిరోజు నియోజకవర్గంలో హోరెత్తించిన పార్టీలు
- రోడ్‌షోలు, ఇంటింటి ప్రచారాలతో సందడి
- మిగిలిన అతికొద్ది సమయంలో పోల్ మేనేజ్‌మెంట్‌పై పార్టీలు బిజీ



ఆళ్లగడ్డ: ఈనెల 13వ తేదీన పోలింగ్ జరగనుండగా.. ఎన్నికల్లో అత్యంత ప్రధాన ఘట్టమైన ప్రచారం శనివారం ముగిసింది. రెండు మాసాలుగా హోరాహోరీగా సాగిన ప్రచారానికి సాయంత్రం ఆరు గంటలకు తెరపడింది. ఎడతెరిపి లేకుండా మోగిన మైకులు మూగపోయాయి. నియోజవర్గంలో వైఎస్సార్‌సీపీ, టీడీపీ, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు పోటీ పడుతుండగా అభ్యర్థులతో పాటు వారి కుటుంబ సభ్యులు, పార్టీ శ్రేణులు ముమ్మరంగా ప్రచారం చేశారు. ఇక చివరి రోజైన శనివారం రోడ్‌షో లు, ఇంటింటి ప్రచారంతో బలప్రదర్శన ద్వార ఓటర్లను ఆకట్టుకునే ప్రయత్నం చేశారు. ఇదే సమయంలో పోల్ మేనేజ్‌మెంట్‌పై ప్రత్యేక దృష్టి సారించారు.

మోత మోగింది..

మార్చి 18 నుంచి 26వ తేదీ వరకు నామినేషన్లు స్వీకరించారు. వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా సుమారు 2 సంవత్సరాలు ముందుగానే గంగుల బిజేంద్రారెడ్డిని ప్రకటించడంతో గడప గడపకు మన ప్రభుత్వం, మా నమ్మకం నువ్వే జగన్ తదితర కార్యాక్రమాలతో ప్రచారాన్ని షురూ చేశారు. టీడీపీ అభ్యర్థిగా అఖలప్రియను చివరి సమయంలో ప్రకటించారు. గత నెల 18 తరువాతే వారి ప్రచారం ఊపందుకుంది. అభ్యర్థులు ప్రత్యేక వాహనాలకు పార్టీ మేనిఫెస్టో, పార్టీ గుర్తులు, అధినాయకుల ఫొటోలతో మైక్‌లు బిగించి పాటలతో హోరెత్తించారు. ఇంటింటికీ కరపత్రాలు, మేనిఫెస్టోలు, గ్యారెంటీ కార్డులు పంచి పెట్టారు. గ్రామ నాయకులు, పార్టీ శ్రేణులు, కార్యకర్తలు మండల, నియోజకవర్గ స్థాయి నేతలు అందరి ఇళ్లకు వెళ్తూ తమ అభ్యర్థికే ఓటు వేయాలని అభ్యర్థించారు. నియోజకవర్గంలో ఎక్కడ చూసిన ఎన్నికల పండగ వాతవరణం కనిపించింది. ప్రచారం ముగియడంతో మైకులు మూగబోయాయి.

చాకరాజువేముల.. అభివృద్ధి భళా

సంక్షేమాభివృద్ధి గురించి చర్చ వస్తే వైఎస్సార్‌సీపీకి ముందు.. తరువాత.. అంటూ ప్రారంభించేలా వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగించారు. ముఖ్యంగా పల్లెల్లో పట్టణ వాతావరణాన్ని కల్పించారు. చాకరాజువేముల గ్రామంలో ప్రభుత్వ కార్యాలయాలు, సీసీ రోడ్లు, డ్రైనేజీలు, పాఠశాలల్లో వసతులు, విద్యుత్ స్తంభాలు, ఇంటింటికీ కుళాయిలు, గోదాములు, లింక్ రోడ్లు తదితర వాటిని కోట్లాది రూపాయలతో నిర్మించారు. అలాగే దాదాపు వివిధ సంక్షేమ పథకాల ద్వారా గ్రామస్తులకు రూ.24.19కోట్లు అందజేయడంతో సమస్యలు దూరమై స్థానికుల మోమున చిరునవ్వు విరబూస్తోంది.

- సంక్షేమం, నాన్ డీబీటీ కింద గ్రామస్తులకు రూ.35 కోట్లకు పైగా లబ్ధి
- సీసీ రోడ్ల నిర్మాణం కోసం రూ.85 లక్షల ఖర్చు
- రూ.17లక్షలతో మారిన పాఠశాలల రూపురేఖలు
- రూ.40 లక్షలతో సచివాలయం నిర్మాణం
- రూ.80 లక్షలతో గోదాము ఏర్పాటు
- రూ.3కోట్లతో దొర్నిపాడు నుంచి డబ్ల్యూ కొత్తపల్లె వరకు బీటీ రోడ్డు పూర్తి



గ్రామంలో నిర్మించిన సచివాలయం



దొర్నిపాడు నుంచి వెంకటేశ్వనగరం వరకు నిర్మించిన బీటీ రోడ్డు



ఎస్సీ కాలనీలో నిర్మించిన సీసీ రోడ్డు

దొర్నిపాడు: నాలుగున్నరేళ్ల క్రితం వరకు పల్లెలు సమస్యల సుడిగుండంలో కొట్టుమిట్టాడేవి. ఒడ్డున పడేసే నాయకుడు లేక తమ బతుకులింతేనని ప్రజలే జీవనం సాగించేవారు. అయితే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పాటైన తరువాత పరిస్థితి ఒక్కసారిగా మారిపోయింది. ప్రస్తుతం చూస్తే ఇది మా ఊరేనా అనేలా మారిపోయేలా అభివృద్ధి పనులు చేపట్టింది. మండలంలోని చాకరాజువేముల గ్రామం, మజరా అయిన వెంకటేశ్వర నగరం అభివృద్ధి పథకంలో దూసుకెళ్తున్నాయి. సంక్షేమ పథకాలు, అభివృద్ధి చేపట్టడంతో గ్రామాలు పట్టణాలను తలపిస్తున్నాయి. సమస్యలు పరిష్కారం కావడంతో జనం సంతోషంగా ఉన్నారు.

సంక్షేమాభివృద్ధి ఇలా..

- గ్రామంలో మొత్తం 6,121 మంది లబ్ధిదారులకు వివిధ సంక్షేమ పథకాల ద్వారా రూ.24.19 కోట్లు లబ్ధి చేకూరింది.
- పరోక్షంగా (ఇళ్ల స్థలాలు, జగనన్న విద్యాకానుక, ట్యాబ్‌ల పంపిణీ, గోరుముద్ద, సంపూర్ణ పోషణ, ఇంటింటా రేషన్) రూ.10.97 కోట్లు గ్రామంలో ప్రభుత్వం ఖర్చు చేసింది.
- చాకరాజువేముల, వెంకటేశ్వరనగరంలో రూ.85 లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణం
- దొర్నిపాడు నుంచి వెంకటేశ్వరనగరం వరకు 4 కి.మీ. మేర బీటీ రోడ్డును రూ.2కోట్లతో పూర్తి చేశారు.
- ప్రాథమిక పాఠశాల (బీసీ) రూ.9.50లక్షలతో అభివృద్ధి, ఎస్సీ కాలనీలోని పాఠశాలను రూ.7.50లక్షలతో తీర్చిదిద్దారు.
- రూ.80 లక్షలతో వెయ్యి మెట్రిక్ టన్నుల గోదాం నిర్మాణం
- దొర్నిపాడు నుంచి చాకరాజువేముల మీదుగా 7.50 కి.మీ. మేర రూ.3 కోట్లతో డబ్ల్యూ కొత్తపల్లె వరకు రోడ్డు ఏర్పాటు

సమస్యలన్నీ పరిష్కారమయ్యాయి



గ్రామాన్ని అభివృద్ధి చేసుకోవాలని ఎన్నో ఏళ్లుగా శ్రమించాం. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక ఊళ్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించడమే కాకుండా ఎన్నో అభివృద్ధి పనులు చేపట్టింది. సీసీరోడ్లు పూర్తిగా వేశారు. సంక్షేమ పథకాలు ప్రతి కుటుంబానికి అందాయి.

– కాకర్ల వెంకటమోహన్‌నాయుడు, చాకరాజువేముల

వెలుగులీనుతున్న నంద్యాల

- పట్టణంలో రూ.2.20 కోట్లతో విద్యుత్ దీపాల ఏర్పాటు
- రూ.70 లక్షలతో సెంట్రల్ లైటింగ్ సిస్టం
- రూ.38 లక్షలతో జోరుగా హైమాస్ట్ లైటింగ్ పనులు
- విద్యుత్ స్తంభాలకు రంగురంగుల డెకరేటివ్ లైట్లు



ఎన్‌జీఓస్ కాలనీలో ఏర్పాటు చేసిన విద్యుత్ దీపాలు



బొమ్మల సత్రం ఫ్లై ఓవర్‌పై ఏర్పాటు చేసిన విద్యుత్ దీపాలు

నంద్యాల(సిటీ): పట్టణంలో రహదారుల వెంట ఏర్పాటు చేసిన నూతన విద్యుత్ దీపాల వెలుగుల్లో నంద్యాల వెలిగిపోతోంది. పట్టణ సుందరీకరణలో భాగంగా నంద్యాల ప్రవేశ ద్వారాల వద్ద మన నంద్యాల, నవ నందుల కోట మిరిమిట్లుగొలుపుతోంది. ముఖ్యంగా పట్టణంలోని పలు రహదారుల వెంట రంగు రంగుల విద్యుత్‌దీప కాంతులతో ధవళ వర్ణ ఎల్‌ఈడీ లైట్లతో పాటు స్తంభాలకు రంగు రంగుల డెకరేటివ్ లైట్లతో చూపరులకు ఆహ్లాదాన్ని పంచేలా మున్సిపల్ అధికారులు ఏర్పాటు చేశారు.

సెంట్రల్ లైటింగ్ సిస్టం వివరాలు..

- పట్టణంలోని సంజీవనగర్ నుంచి ఆత్మకూరు బస్టాండ్ వరకు సుమారుగా రెండు కి.మీ మేర రూ.40 లక్షలతో 52 స్తంభాలు (ఇందులో 19 కొత్త పోల్స్ వేశారు), 104 సరి కొత్త ఎల్‌ఈడీ లైట్లను వేశారు. 1,800 మీటర్ల మేర కొత్తగా ఆర్మ్‌డ్ కేబుల్‌ను అమర్చారు, 1,800 మీటర్లతో జీఐ పైప్ లైన్ ద్వారా భూమిలో వేశారు.
- ఎన్‌జీఓ కాలనీలో కేశవరెడ్డి పాఠశాల నుంచి 80 ఫీట్ రోడ్డు వరకు సుమారుగా కి.మీ మేర రూ.30 లక్షలతో 28 కొత్త పోల్స్, 56 ఎల్‌ఈడీ లైట్లు అమర్చారు.

పలు ప్రాంతాలలో విద్యుత్ దీపాలంకరణ..

- పట్టణంలో పలు ప్రాంతాలలో విద్యుత్ స్తంభాలకు విద్యుత్ దీపాలంకరణ చేశారు. ఇందుకు సుమారుగా రూ.4లక్షలు వెచ్చించారు.
- బొమ్మలసత్రం ఫ్లై ఓవర్, బస్టాండ్ నుంచి సంజీవనగర్, సంజీవనగర్ నుంచి ఆత్మకూరు బస్టాండ్, జీజీహెచ్ నుంచి శ్రీనివాస సెంటర్ వరకు, అలాగే ఎన్‌జీఓ కాలనీ, పద్మావతి నగర్ రోడ్డులో ఇలా పలు ప్రాంతాల్లో నూతన వెలుగులు పట్టణవాసులకు ఆహ్లాదాన్ని పంచుతున్నాయి.

రాత్రే పగలులా ఉంటోంది



ఎన్‌జీఓ కాలనీలో కొన్నేళ్లుగా నివాసం ఉంటున్నాం. ఈ ప్రాంతంలో కొత్తగా సెంట్రల్ లైటింగ్ సిస్టం ఏర్పాటుతో రాత్రుళ్లు పగటి లాగే ఉంటోంది. గతంలో ఏదైనా లైట్ పోతే ఎవరికి చెప్పాలో కూడా తెలియని దుస్థితి. నేడు మార్పు చాలా స్పష్టంగా కనిపిస్తోంది. విద్యుత్ దీపాలంకరణ చాలా బాగుంది. రాత్రులలో వాహదారులకు ఎలాంటి ఇబ్బందులు కూడా తలెత్తవు. –వీర మల్లేష్, నంద్యాల

చెప్పినవన్నీ చేస్తున్నాం

నంద్యాల జిల్లా కేంద్రాన్ని తీర్చి దిద్దుతున్నాం. కేవలం కొద్ది రోజుల్లోనే మార్పు స్పష్టంగా కనిపిస్తుంది. నంద్యాల అభివృద్ధి కేవలం మా హయాంలోనే జరిగిందని చెప్పేందుకు గర్విస్తున్నా. ప్రజలకు పూర్తి స్థాయిలో మౌలిక సదుపాయాలకు ప్రభుత్వం పెద్దపీట వేసింది. రానున్న రోజుల్లో సెంట్రల్ లైటింగ్ సిస్టంతో పాటు హై మాస్ట్ లైట్లతో మరింత సుందరంగా నంద్యాలను తీర్చిదిద్దుతాం. – షేక్ మాబున్నిసా, మున్సిపల్ చైర్ పర్సన్

హై మాస్ట్ లైట్ల ఏర్పాటుతో మరింత అందం..

పట్టణంలోని ప్రధాన కూడళ్లలో రూ.38 లక్షలతో హై మాస్ట్ లైట్లను ఏర్పాటు చేయడానికి ప్రభుత్వ ప్రతిపాదనలు పూర్తయ్యాయి. ఇందుకు సంబంధించి పలు ప్రాంతాలలో ఎలక్ట్రికల్ పోల్స్ వేయడానికి పిల్లర్లు కూడా మున్సిపల్ అధికారులు సిద్ధం చేశారు. కొద్ది రోజుల్లో ఈ పనులు పూర్తి చేయనున్నట్లు మున్సిపల్ అధికార వర్గాలు పేర్కొంటున్నాయి. మున్సిపల్ కార్యాల యం ఎదురుగా, ఎస్బీఐ కాలనీ ప్రవేశం, ప్రభుత్వ ఆసుపత్రి ముందు, ఎన్‌జీఓ కాలనీలో ఏర్పాటు చేసేందుకు పనులు జరుగుతున్నాయి.